5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

హసన్‌పర్తి, ఆగస్టు 26 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని హసన్‌పర్తి పోలీసులు పట్టుకున్నారు. సీఐ వట్టె చేరాలు కథనం ప్రకారం.. ఏఎస్సై జనార్దన్ పోలీస్ సిబ్బందితో కలిసి మండలంలోని మడిపల్లిలో సోమవారం పెట్రోలింగ్ చేస్తుండగా రోడ్డుపైన వస్తున్న ఆటో డైవర్ పోలీసులను చూసి పారిపోతున్న క్రమంలో వారిని వెంబడించి ఆటోను ఆపి తనిఖీ చేశారు. అందులో 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. జయగిరికి చెందిన దండుగుల సాయిలు(60), దండుగుల కొమురమ్మ (57)ఆటో డ్రైవర్ పోలు అశోక్‌ను విచారించగా, చుట్టు పక్కల గ్రామాల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. దీంతో బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తా..

కుటుంబసభ్యులతో చంద్రకళ

భీమదేవరపల్లి, ఆగస్టు 26 : తనను పెళ్లి చేసుకుని ముఖం చాటేసిన తన భర్త బొల్లంపల్లి రంజిత్‌పై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని అతడి భార్య చంద్రకళ తెలిపింది. సోమవారం మండలంలోని ముల్కనూరులో ఆమె మాట్లాడుతూ.. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం చిన్నకొండేపూడి గ్రామానికి చెందిన తనను ముల్కనూరు గ్రామానికి చెందిన రంజిత్ ఆర్లేక్ర క్రితం రాజమండ్రిలోని ఒక చర్చిలో వివాహం చేసుకున్నట్లు చెప్పింది. రంజిత్ అన్న రాజు పెళ్లి అనంతరం ఇంటికి తీసుకెళ్తానని చెప్పి ఇప్పుడు మాయం అయ్యాడని ఆరోపించింది.14 రోజులుగా తన భర్త ఆచూకీ చెప్పాలంటూ ముల్కనూరులోని రంజిత్ ఇంట్లో పోరాటం చేస్తున్నా అతడి కుటుంబసభ్యులు పట్టించుకోవడం లేదని చెప్పింది. తనది ఈ రాష్ట్రం కాకపోయినప్పటికీ ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు తనకు మద్దతుగా నిలిచాయని, తనకు జరిగిన అన్యాయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని పేర్కొన్నది.

కాజీపేటలో గంజాయి సీజ్ : ముగ్గురి అరెస్ట్

కాజీపేట, ఆగస్టు 26 : కాజీపేటలో ఆదివారం సాయంత్రం ముగ్గురు వ్యక్తుల నుంచి పోలీసులు 4.700కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేశారు. కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో ఎస్సై నవీన్‌కుమార్ పోలీస్ సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా చేతుల్లో ప్లాస్టిక్ కవర్లు కలిగిన ముగ్గురు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు పట్టుకుని, ఆరా తీయడంతో పొంతనలేని సమాధాలు చెప్పడంతో వారి వద్దనున్న ప్లాస్టిక్ కవర్లను తనిఖీ చేయగా గంజాయి బయట పడింది. పట్టణానికి చెందిన వడల శ్రావణ్ కుమార్, కిలారి శోభన్‌కుమార్, సయ్యద్ షకీర్ అలీ గంజాయికి అలవాటు పడి, వచ్చే డబ్బులు ఖర్చులకు సరిపోక పోవడంతో గంజాయిని అమ్మాలని నిర్ణయించుకున్నారు. వారి స్నేహితులైన సయ్యద్ సాహెబ్ అలీ, బైరబోయిన శ్రావణ్‌కుమార్‌ను గంజాయి గురించి అడిగారు. దీంతో వారు రైలులో భద్రాచలం వెళ్లి గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నాలుగు కిలోల ఏడు వందల గ్రాముల గంజాయి ఖరీదు చేసి వరంగల్‌కు తీసుకువచ్చి వీరికి అమ్మినట్లు చెప్పారని పోలీసులు తెలిపారు. వడల శ్రావణ్ కుమార్, కిలారి శోభన్‌కుమార్, సయ్యద్ షకీర్ అలీ వద్ద దొరికిన ఈ గంజాయి సుమారు రూ.1,17,500 విలువ ఉంటుందని పేర్కొన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. వీరికి గంజాయి అమ్మిన సయ్యద్ సాహెబ్ అలీ, బైరబోయిన శ్రావణ్‌కుమార్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఒంటిమామిడిపల్లిలో మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్టేట్ ఫైనాన్స్ చైర్మన్ రాజయ్య

ఐనవోలు, ఆగస్టు 26 : మండల కేంద్రానికి చెందిన బోలెపల్లి రామస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సోమవారం పరామర్శించారు. అలాగే, అనారోగ్యంతో బాధపడుతున్న శేఖర్‌గౌడ్ ఇంటికి వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సంపత్‌కుమార్, మాజీ ఎంపీటీసీ మధుచంద్రగౌడ్, డబ్బా శ్రీను ఉన్నారు. అలాగే, మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన మజ్జిగ వెంకటనారాయణ, మజ్జిగ రంజిత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రాజు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు మోహన్, మాజీ ఎంపీటీసీ యాకూబ్ పాషా, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు రమేశ్, తిరుపతి, సమ్మయ్య, మహేందర్ ఉన్నారు.

హసన్‌పర్తి : కృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు

హనుమకొండ : సన్‌షైన్ ప్లే స్కూల్‌లో..

హనుమకొండ : చిన్నారులతో ఎంపీ కడియం కావ్య


కాజీపేట : సోమిడిలో పూజలు చేస్తున్న కార్పొరేటర్

కృష్ణతత్వం సదా ఆచరణీయం

- భగవద్గీత సారం స్ఫూర్తిదాయకం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్
- ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

హనుమకొండ, ఆగస్టు 26 : కృష్ణతత్వం సదా ఆచరణీయం, భగవద్గీత సారం స్ఫూర్తిదాయకమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సోమవారం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో వేడులు నిర్వహించారు. దాస్యం ఉట్టి కొట్టాక, గోపిక, శ్రీకృష్ణిని వేశధారాణలో చిన్నారులు నృత్యం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కుల మతాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రపంచ వ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరుపుకొంటున్నారన్నారు. సర్వ మానవాళికి భగవద్గీత సారాంశం స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, సంకు నర్సింగ్, పశ్చిమ నియోజక వర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, నాయకులు జోరిక రమేశ్, జానకీరాములు, రవీందర్ రావు, రామ్మూర్తి, వెంకన్న, రాకేశ్‌యాదవ్, ప్రణయ్ పాల్గొన్నారు.

సన్‌షైన్ స్కూల్‌లో..

హనుమకొండ భవానీ నగర్‌లోని సన్‌షైన్ ప్లే స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు గోపిక, రాధా, కృష్ణుడి వేషధారణలో అలరించారు. కేరింతలతో ఉట్టి కొట్టారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ నరేశ్ గుప్తా, చిన్నారుల తల్లిదండ్రులు, టీచర్లు శ్రీలేఖ, సునీత, శిల్పా, రమ్య, వినీత, రవళి, లిఖిత, మాధవి పాల్గొన్నారు.

'మల్లికాంబ'లో పాల్గొన్న ఎంపీ కావ్య..

బాలసముద్రంలోని మల్లికాంబమనో వికాస కేంద్రంలో సోమవారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ మల్లికాంబమనో వికాస కేంద్రంలోని చిన్నారులతో కలసి కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. ఎన్ని అవాంతరాలు వచ్చినా, కష్టసుఖాలను సమభావంతో స్వీకరిస్తూ, అమూల్యమైన ఈ జీవితాన్ని పండుగగా మలుచుకోవాలనే సందేశాన్ని శ్రీకృష్ణ పరమాత్ముని జీవితం మనకు అందిస్తుందని తెలిపారు. ద్వాపర యుగంలో జన్మించిన శ్రీకృష్ణుని మహోన్నత వ్యక్తిత్వం, జీవన విధానం నేటికలియుగంలోనూ మనకు గొప్ప ప్రేరణనిస్తాయని తెలిపారు. శ్రీకృష్ణుడు ప్రవచించిన గీత కేవలం ఆధ్యాత్మిక బోధనలకు మాత్రమే పరిమితం కాదనీ, అదొక విజ్ఞాన భాండాగారమని ఆమె పేర్కొన్నారు. అనంతరం కృష్ణుని, గోపికల వేష ధారణలో అలరించిన చిన్నారులకు ఎంపీ కడియం కావ్య మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ ప్రోపెసర్ పద్మ పాల్గొన్నారు.

గోకుల్‌నగర్‌లో..

నయీంనగర్ : హనుమకొండలోని గోకుల్ నగర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే వారికి జ్ఞాపికలు అందచేసి అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ స్వరూప, సన్‌షైన్ విద్యా సంస్థల అధినేత కుమార్, బంక సంపత్, బంక సరళ పాల్గొన్నారు.

కాజీపేట/ఎల్కతుర్తి /హసన్‌పర్తి/దామెర/శాయంపేట : సోమిడిలోని రాధా కృష్ణ స్వామి దేవాలయంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ దంపతుల ఆధ్వర్యంలో అయినవోలు రాధాకృష్ణ శర్మ-సాయి కృష్ణ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పిల్లలు కృష్ణుడు-రుక్మిణి, సత్యభామ వేశధారణలో కోలాటం ఆడి, ఉట్టి కొట్టారు. విష్ణుపురి చౌరస్తాలో కొండ శివ ఆధ్వర్యంలో వేడులను నిర్వహించారు. శ్వేతార్క మూల గణపతి ఆలయంలో వేద పండితుడు త్రిగుళ్ల శ్రీనివాస శర్మ అభిషేకాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ అయినవోలు వెంకటేశ్వర శర్మ ఉన్నారు. ఎల్కతుర్తి మండలంలోని వల్లాపూర్‌లో 27వ తేదీ వరకు నిర్వహించనున్న వేడుకలను సోమవారం ప్రారంభించారు. హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్‌లోని ఎస్సీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పాఠశాల డైరెక్టర్ గౌరిశెట్టి జగన్ మోహన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. హెచ్ఎం శేషగిరిరావు పాల్గొన్నారు. దామెర మండలంలోని పులుకూర్తి, కోగిల్వాయి, పసరగొండ, ఊరుగొండ, దామెర గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో బత్తిని చిన్నరాజు, మిరియాల రవికుమార్, ఒడిదోల మల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు. శాయంపేటలోని మత్స్యగిరి స్వామి ఆలయంలో వేడుకలు నిర్వహించారు. అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ సామల భిక్షపతి, బాసాని సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. గాంధీచౌక్, బస్టాండ్ సెంటర్ కాలనీలు, గ్రామాల్లో ఉట్టి కొట్టి సంబురాలు జరుపుకున్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో ఉట్టి కొడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

గోకుల్‌నగర్‌లో ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని

వరంగల్ : భద్రకాళీ అమ్మవారికి రెండు కిలోల వెండి గంగాలం బహూకరిస్తున్న వినయ్‌భాస్కర్-రేవతి దంపతులు, (ఇన్‌సెట్‌లో) హనుమకొండ చౌరస్తా : కృష్ణుడి అలంకరణలో వేయిస్తంభాల రుద్రేశ్వరస్వామి

శ్రీకృష్ణుడి అలంకరణలో రుద్రేశ్వరస్వామి, భద్రకాళీ

హనుమకొండ చౌరస్తా/వరంగల్ : చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయం, ప్రసిద్ధ భద్రకాళీ ఆలయంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రుద్రేశ్వరస్వామికి 150 మంది దంపతులు సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించి 51 కిలోల పెరుగన్నంతో పూజ నిర్వర్తించి శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనం కల్పించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. భద్రకాళీ అమ్మవారు సోమవారం సాయంత్రం శ్రీకృష్ణుడి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో భద్రకాళీ ఆలయ ప్రధాన అర్చకుడు భద్రకాళీ శేషు, మణికంఠశర్మ, సందీప్‌శర్మ, ప్రణవ్‌శర్మ, శ్రావణ్ పాల్గొన్నారు. ఆలయాన్ని సందర్శించిన వారిలో తెలుగు రాష్ట్రాల ఆదాయపన్ను శాఖ అధికారి రాజేశ్వర్, హనుమకొండ సీఐ సతీశ్‌కుమార్ ఉన్నారు. కాగా, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్-రేవతి దంపతులు భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 2కిలోల వెండి గంగాలం దేవాలయానికి బహూకరించారు. నగరంలోని జెమినీ థియేటర్ ఎదురుగా ఉన్న మురళీ కృష్ణా ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు దేవాలయంలో ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఉట్టి కొట్టే ఉత్సవాన్ని నిర్వహించారు.

మొరం డంపును పరిశీలించిన అధికారులు

'నమస్తే' తెలంగాణ ఎఫెక్ట్

ఐనవోలు, ఆగస్టు 26 : పట్టుకున్న మొరం దొంగల పాలేనా? అనే శీర్షికన నమస్తే దినపత్రికలో వార్త సోమవారం ప్రచురితం అయింది. కాగా, స్థానిక ఎస్సై పస్తం శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది మొరం ఉందా లేదా అని ఒకరికి తెలియకుండా, మరొకరు మొరం డంపును పరిశీలించారు. అలాగే ఆగస్టు 13న మొరం పట్టుకుంటే, 14న ఎస్సై శ్రీనివాస్ తహసీల్దార్‌కు లేఖ రాసినట్లు వెల్లడించారు.

సూపర్ మార్కెట్ యజమాని ఆత్మహత్య

కార్తీక్ (ఫైల్)

కమలాపూర్, ఆగస్టు 26 : మండల కేంద్రానికి చెందిన కార్తీక్ సూపర్ మార్కెట్ యజమాని సుద్దాల కార్తీక్ (35) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ హరికృష్ణ సోమవారం తెలిపారు. కొంతకాలంగా పరకాల-హుజూరాబాద్ రహదారి పక్కనే సూపర్ మార్కెట్ నిర్వహిస్తున్నాడు. వ్యాపారం సరిగ్గా నడవకపోవడంతో అప్పులు పెరిగాయి. వాటిని ఎలా తీర్చాలనే బెంగతో ఉరివేసుకున్నట్లు తెలిపారు. అతడి భార్య అర్చన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

అమెరికాలో మృతి చెందిన రాజేశ్ అంత్యక్రియలు

ఆత్మకూరు, ఆగస్టు 26 : అమెరికాలో ఆగస్టు 15న మృతి చెందిన ఏరుకొండ రాజేశ్ మృతదేహానికి ఆత్మకూరులోని ఆయన నివాసంలో సోమవారం అంత్యక్రియలు జరిగాయి. రాజేశ్ పార్థివ దేహానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. తన విన్నపానికి స్పందించి మృతదేహం స్వగ్రామానికి వచ్చేలా కృషి చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు.

నిందితుడికి పీడీయాక్ట్ ఉత్తర్వు కాపీని అందజేస్తున్న సీఐ రంజిత్‌రావు

గంజాయి స్మగ్లర్‌పై పీడీ యాక్ట్

సుబేదారి, ఆగస్టు 26 : భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి గ్రామానికి చెందిన గంజాయి స్మగ్లర్ గజ్జి సహదేవ్‌రాజ్‌పై పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పీడీయాక్ట్ నమోదు చేశారు. పీడీయాక్ట్ ఉత్తర్వును శాయంపేట సీఐ రంజిత్‌రావు దామెర ఎస్సై అశోక్ సోమవారం పరకాల సబ్‌జైల్లో ఉన్న సహదేవ్‌రాజ్‌కు అందజేశారు. నిందితుడు ఏపీ నుంచి గంజాయి స్మగ్లింగ్ చేస్తూ 192 కిలోల గంజాయి, కారుతో పోలీసులకు పట్టుబడ్డాడు. గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడిన వ్యక్తులపై పీడీయాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

నిందితులను ఉరి తీయాలని ర్యాలీ

హనుమకొండ : ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు, విద్యార్థులు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 26 : కోలకతాలో డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను ఉరితీయాలని డిమాండ్ చేస్తూ ముస్లిం ఐక్యవేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో హనుమకొండ చౌరస్తాలో నిరసన ర్యాలీ తీశారు. దేశ వ్యాప్తంగా రోజురోజుకూ అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని, చిన్నపిల్లలను సైతం వదిలిపెట్టడం లేదని మండిపడ్డారు. నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనీస్‌సిద్ధికి, రాజ్‌మహ్మద్, షేక్ బాబా, ఎండీ మౌసిన్, ఎంఏ రషత్, తస్లీన్, సయ్యద్ గౌస్, గౌస్‌పాషా పాల్గొన్నారు.

హనుమకొండ : కోల్‌కతా ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపట్టి విద్యార్థినులు, స్త్రీలకు రక్షణ కల్పించాలని తెలంగాణ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (టీ జూడా) రాష్ట్ర చైర్మన్ దుబ్యాల శ్రీనాథ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బాలసముద్రంలోని ఏకశిల పార్కులో తెలంగాణ జూనియర్ డాక్టర్లు, విద్యార్థులు ర్యాలీ తీసి, కార్నర్ మీటింగ్ నిర్వహించారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి, ఎంజీఎం దవాఖానలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ర్యాలీలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారావు పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించగా కేఎంసీ జూనియర్ డాక్టర్లు లోకేశ్, కశ్యబ్, కావ్య, నిఖిల్, దివ్య, అఫ్రోజ్, అమిత్, భవ్య, నవనీత్ పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా ఆయశ సాధనకు కృషి చేయాలి

కాజీపేట/పరకాల, ఆగస్టు 26 : మదర్ థెరిస్సా ఆశయ సాధనకు కృషి చేయాలని సెయింట్ జోసఫ్ చర్చి ఫాదర్ కాసు మరెడ్డి అన్నారు. ఫాతిమానగర్ చౌరస్తాలో విగ్రహ కమిటీ కన్వీనర్ రాజామోహన్‌రావు ఆధ్వర్యంలో సోమవారం మదర్ థెరిస్సా 114వ జయంతి నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూల మాలలు వేశారు. మత్యాస్‌రెడ్డి, అల్లం ప్రకాశ్‌రెడ్డి, జ్ఞాన ప్రకాశ్, బైరపాక ప్రభాకర్, భిక్షపతి, చిన్నప్ప పాల్గొన్నారు. పరకాల లోని సీఎస్ఐ బేతోల్ ఆశ్రమంలో విద్యార్థులతో కలిసి కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

హనుమకొండ, ఆగస్టు 26 : హనుమకొండ కలెక్టరేట్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని హనుమకొండ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ విద్యుత్తు అభివృద్ధి పనుల్లో భాగంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, జూలైవాడ, రోహిణి, శ్రీకృష్ణ ఆస్పత్రి ఏరియా, సుబేదారి మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో కరెంటు ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత

- ఇష్టారాజ్యంగా కలప అక్రమ వ్యాపారం
- మాములుగా తీసుకుంటున్న అటవీ అధికారులు

కమలాపూర్‌లో చెట్లను నరికి, ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న కలప వ్యాపారులు

కమలాపూర్, ఆగస్టు 26 : ఓ వైపు ప్రభుత్వాలు కోట్లు ఖర్చుపెట్టి మొక్కలు నాటిస్తుంటే మరోవైపు చెట్లను కొందరు యథేచ్ఛగా నరికేస్తూ కలప అక్రమ వ్యాపారం చేస్తున్నా అటవీశాఖ అధికారులు మామూలుగా తీసుకుంటున్నారు. మండలంలోని కమలాపూర్, శ్రీరాములపల్లి, శనిగరం, ఉప్పల్, కన్నూరు, వంగపల్లి తదితర గ్రామాల్లో చెట్లను నరికేస్తూ కలప వ్యాపారం చేస్తున్నారు. మండల కేంద్రంలోని సామిల్లులకు తరలిస్తుండగా, మరికొందరు వరంగల్‌కు తరలిస్తూ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా వ్యవసాయ భూములు, రోడ్ల వెంట నాటిన చెట్లు, ప్రభుత్వ భూముల్లో పెరిగిన తుమ్మ, వేప, చింత, నమిలినార, టేకు వంటి చెట్లను నరికివేస్తూ ట్రాక్టర్లలో తరలిస్తూ లక్షల రూపాయలు గడిస్తున్నారు. అక్రమంగా కలప వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ వ్యాపారులు, సామిల్లర్లను నియంత్రించాల్సిన అటవీశాఖ అధికారులు వారికే వంత పాడుతున్నారు.

మొక్కల పెంపకానికి కోట్లు ఖర్చు..

ప్రతి ఏటా మొక్కల పెంపకానికి ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతోంది. గత ప్రభుత్వం హరితహారం పేరుతో పెద్ద ఎత్తున మొక్కలు నాటింది. ప్రస్తుత ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనం, అమ్మ పేరుతో ఒక మొక్క నాటుదాం అంటూ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతూ వేలాది మొక్కలు నాటుతున్నది. మొక్కల పెంపకంతోనే మానవాళి మనుగడ ముడిపడి ఉందంటూ, పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అంటూ నినాదాలతో ప్రజలను చైతన్యం చేస్తున్న అధికారులు, చెట్లను నరికివేస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. కలప వ్యాపారులు చెట్లను నరికివేస్తున్నా అటవీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వాల్టా లాంటి చట్టాలు ఉన్న నియంత్రించడం లేదు. చెట్లను నరికివేతతో భవిష్యత్ తరాలకు ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. చెట్లను నరికివేస్తూ కలప అక్రమ వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై డిప్యూటీ రేంజ్ అధికారి ప్రిసిల్లాను వివరణ కోరగా, ఎలాంటి అనుమతి లేకుండా వ్యాపారం చేస్తున్న వారికి జరిమానా విధిస్తున్నామని, అక్రమంగా కలప తరలిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శాయంపేట స్పెషల్ ఆఫీసర్ ఎవరు?

శాయంపేట, ఆగస్టు 26 : శాయంపేట మండలానికి స్పెషల్ ఆఫీసర్ ఎవరు? అనేది అయోమయంగా మారింది. జిల్లా సంక్షేమ అధికారి స్పెషలాఫీసర్‌గా ఉండగా ఆమె బదిలీ కావడం, మరొకరు ఆ స్థానంలోకి వచ్చారు. కానీ ఇప్పటికీ మండలానికి స్పెషలాఫీసర్‌గా రాలేదు. స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ హరిప్రసాద్ కొన్ని సంవత్సరాలు పని చేశారు. అయితే ఆయన ఉద్యోగ విరమణ చేశారు. ఈ క్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మధురిమను నియమించారు. ఆ తర్వాత జరిగిన బదిలీల్లో నర్సంపేటకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. కాగా, జిల్లా సంక్షేమ అధికారిగా రాజమణి ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. అయితే ఆమెను మండల స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వలేదని ఎంపీడీవో ఫణిచంద్ర సోమవారం తెలిపారు. ఈ విషయమై 15 రోజుల క్రితమే కలెక్టర్‌కు లేఖ పంపినట్లు తెలిపారు. ఇప్పటికైనా మండలానికి ప్రత్యేక అధికారిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.


శివాలయం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

శివాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తా : ఎమ్మెల్యే రేవూరి

ఆత్మకూరు, ఆగస్టు 26 : శివాలయం నిర్మాణం కోసం అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆత్మకూరులో నూతనంగా నిర్మిస్తున్న శివాలయ పనులను పరిశీలించారు. ఆలయంలో ప్రతిష్ఠించే నూతన విగ్రహాలతో పాటు, ధ్వజస్తంభ ఏర్పాటు గురించి కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, వేగంగా పూర్తి చేయాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు.

అసంపూర్తిగా మరుగుదొడ్లు

రైతు వేదికల వద్ద మహిళల ఇబ్బందులు పట్టించుకోని అధికారులు

ఆత్మకూరు, ఆగస్టు 26 : మండలంలోని పెద్దాపురం, ఆత్మకూరు గ్రామాల్లో రైతు వేదికల వద్ద చేపట్టిన మరుగుదొడ్ల పనులు అసంపూర్తిగా వదిలేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు పూర్తి కాలేదు. మరుగుదొడ్ల వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. పనులు పూర్తి చేయకపోవడంతో వివిధ పనుల కోసం రైతువేదిక వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్ల నిర్మాణం కోసం ప్రతి రైతు వేదిక వద్ద అప్పటి ప్రభుత్వం రూ.5లక్షలు కేటాయించింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

పెద్దాపురం రైతువేదిక వద్ద పిచ్చి మొక్కల మధ్య అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్డి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★ప్రముఖ